క్లుప్తంగా

సర్వేలో లోపాలు నివారించండి

అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగన్నాథ్



తెనాలిఅర్బన్: సర్వేలో ఎటువంటి లోపాలు దొర్లకుండా చూడాలని అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగనాథ్ పేర్కొన్నారు. 16వ వార్డులో జరుగుతున్న ఎన్‌సీడీ సీడింగ్, హౌస్ హోల్డ్ సర్వేలను బుధవారం ఆయన పరిశీలించారు. సర్వే చేసే విధానాన్ని అడిగి తెసుకుని పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



తెనాలిరూరల్: రూరల్ పరిధిలోని జగ్గడిగుంట పాలెంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితురాలికి బుధవారం నిత్యావసరాలను అందించారు. దాత మొవ్వ సత్యనారాయణ అందించిన రూ. ఐదు వేల నగదును, రెడ్ క్రాస్ తెనాలి శాఖ అందించిన వంట పాత్రలను, రెవెన్యూ శాఖ నుంచి బియ్యం నిత్యావసరాలను బాధితురాలు గండికోట ఆదిలక్ష్మికి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులను ఆదుకునేందుకు దాతలు, రెడ్ క్రాస్ సంస్థ స్పందిస్తున్న తీరు అభినందనీయమన్నారు. మొవ్వ సత్యనారాయణ, రెడ్ క్రాస్ బృందం పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి




కొల్లూరు: గర్భిణులు అనారోగ్యానికి గురవ్వకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ కొల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని బొద్దులూరుపాడులో సామాజిక వేడుకలలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ముఖ్యమని లేని పక్షంలో రక్తహీనతకు గురయ్యే ముప్పు ఉందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహార పదార్థాలతో పాటు, తక్కువ ఖర్చుతో బలవర్ధక ఆహార పదార్థాలను తయారు చేసుకొని తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బి.నగరాజ కుమారి పాల్గొన్నారు.

23న ఉచిత కంటి వైద్య శిబిరం

భట్టిప్రోలు: భట్టిప్రోలు డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినాల మనుమడు హ్యాండీ జోయల్ మొదటి పుట్టిన రోజు సందర్భంగా (కేఎస్‌కే) విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో శంకర్ కంటి ఆసుపత్రి (పెదకాకాని) వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయబడునని తెలిపారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్, రేషన్, ఓటరు, ఆరోగ్యశ్రీ కార్డుల జిరాక్స్ కాపీలు, ఫోన్ నెంబర్ తీసుకుని రావాలని విజ్ఞప్తి చేశారు. పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 950239 6090 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



పెదపులివర్రు(భట్టిప్రోలు): మండలంలోని పెదపులివర్రు, ఓలేరు గ్రామ పంచాయతీలలో బుధవారం రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో గ్రామం నుంచి ఎంపీటీసీ సభ్యుల అభ్యర్థన మేరకు రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో రహదారులు, తాగునీటి సరఫరా, సీసీ డ్రైన్‌ల నిర్మాణం నిమిత్తం మండల పరిషత్ నిధుల నుంచి మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.జెడ్పీటీసీ సభ్యురాలు టి.ఉదయ భాస్కరి, ఎంపీటీసీ సభ్యు రాలు నీలా సాంబమ్మ, పంచాయతీ వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


నియోజకవర్గంలో అధ్వానంగా రోడ్లు

పట్టించుకోని అధికారులు, పాలకులు

తెనాలిరూరల్: నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. పరిసర గ్రామాల్నుంచి తెనాలికి రావడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 'సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు' అంటూ హడావిడి చేసిన కూటమి ప్రభుత్వం కేవలం కొన్ని రహదారులకు చిన్నపాటి మరమ్మతులు చేసి అభివృద్ధి చేస్తున్నామంటూ ఊదరకొడుతున్నారు మినహా క్షేత్ర స్థాయిలో పరిస్థితి మరో విధంగా ఉంది. నియోజకవర్గంలో తెనాలి–విజయవాడ రహదారిలో కొద్ది మరమ్మతులు చేపట్టారు మినహా ఇతర రోడ్లను వదిలేశారు. మండల గ్రామం అంగలకుదురు నుంచి బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం చుండూరు మండలంకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుకు ఓ వైపు తుంగభద్ర సైడ్ ఛానల్ పక్క పొలాలు, చావావారిపాలెంకు వెళ్లే రోడ్డు సబ్బుల కంపెనీ, ఇతర కొన్ని భవనాలు ఉన్నాయి. అధ్వానంగా ఉన్న రోడ్డులో కనీసం వీధి దీపాలు లేవు. రాత్రి వేళలో వాహనం అదుపు తప్పితే అటు కాల్వలోకి లేదా పొలాల్లోకి వాహనం బోల్తా కొట్టడమే. చుండూరు మండలంలోని గ్రామాలకు పట్టణానికి రావడానికి ఈ మార్గమే శరణ్యం. అయినా ఏ అధికారి, ప్రజాప్రతినిధికి పట్టడం లేదు. కొల్లిపర మండలం చక్రాయపాలెం నుంచి దావులూరుకు వెళ్లే రోడ్డు మరింత అధ్వానంగా ఉంది. కనీసం ద్విచక్రవాహనం వెళ్లేందుకూ ఇబ్బందికరంగా రోడ్డు మారింది. కొన్ని చోట్ల రోడ్డు సగానికిపైగా కోతకు గురైనట్టు దెబ్బతింది. ద్విచక్రవాహనదారులు అతికష్టం మీద ప్రయాణిస్తున్నారు. ఏమాత్రం బ్యాలెన్స్ తప్పినా ప్రమాదమే అని తెలిసినా పట్టించుకున్న నాథుడే లేడు. చక్రాయపాలెం–దావులూరు గ్రామాల మధ్య రోడ్డు రైతుల వ్యవసాయ అవసరాలకు ఏక్కువగా ఉపయోగపడుతుంది. నూర్పిళ్ల దగ్గర నుండి యూరియా, ఎరువులు, అంది వచ్చిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్లడం చేస్తుంటారు. పూర్తిగా అధ్వానంగా తయారైన రోడ్డులో వాహనదారులే కాకుండా రైతులూ ఇబ్బందులు పడుతున్నారు. తెనాలి నుంచి చుండూరు మండలం దుండిపాలెం వెళ్లే డొంక రోడ్డు సైతం అధ్వానంగా ఉంది. వీధి దీపాలు లేక, రోడ్డు అధ్వానంగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో పినపాడు, ఆలపాటి నగర్ ప్రాంతాల ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. యడ్లపల్లి, దుండిపాలెం వంటి గ్రామాల నుంచి పట్టణానికి రావడానికి వీలుగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతోంది. సంక్షేమ పథకాలను ఎటూ ఈ పది నెలల్లో ఆపేశారు. కనీసం రోడ్లును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం తెనాలి–విజయవాడ, తెనాలి–గుంటూరు రహదారులకు మరమ్మతులు చేపట్టడమే కాకుండా నియోజక వర్గంలో ప్రజలు వినియోగించుకునే ప్రధాన రోడ్డుల మరమ్మతులు/రోడ్ల నిర్మాణం చేపట్టాలన్న డిమాండ్ వినిపిస్తోంది.



సగానికి పైగా ధ్వంసమైన రోడ్డు



చక్రాయపాలెం-దావులూరు మధ్య దెబ్బతిన్న రోడ్డు



అధ్వానంగా అంగలకుదురు-యడ్లపల్లి రోడ్డు

కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోండి

తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిఅర్బన్: విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ను డెవలప్‌మెంట్ చేసుకోవాలని తెనాలి తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ సూచించారు. బుర్రిపాలెం రోడ్డులోని ఎన్ఆర్‌కె అండ్ కెఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాలలో బుధవారం యాన్యువల్ డే వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత ఉద్యోగాలు సాధించాలంటే ఎక్కువ కృషి, పట్టుదల అవసరం అని తెలిపారు. నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ గోగినేని విజయకృష్ణ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. అనంతరం సెమిస్టర్ ఫలితాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మానించారు. అలాగే నాగార్జున యూనివర్శిటీ పరిధిలో ఇటీవల జరిగిన హ్యాండ్‌బాల్ పోటీలలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను సన్మానించి కప్పు అందజేశారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ డి.శ్రీనివాసరావు,అధ్యాపకులు ఎం.దశరథ రామిరెడ్డి, కెవి రవికుమార్, ఎస్‌కె రఫీ,సునీత, కళావతి,నాగరాజు, ఎ.బాలగోపాల్, పీజీ కళాశాల ప్రిన్సిపల్ నరేష్, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ ఆశియా, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



డాన్స్ చేస్తున్న విద్యార్థినులు



కీడాకారులకు కప్ అందజేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, మురళీకాంత్

చెత్త సేకరణ నూరు శాతం చేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: తెనాలిలో చెత్త సేకరణ నూరు శాతం జరిగే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. బీసీ కాలనీలో బుధవారం ఆయన పర్యటించారు. ఆప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్లు, మురుగు కాల్వలపై చెత్త ఉండకుండా చూడాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



వ్యోమగామి సునీత విలియమ్స్ రాకపై హర్షం

తెనాలిఅర్బన్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 9నెలల నుంచి చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీత విలియమ్స్, విల్‌మోర్‌లు తిరిగి భూమిపైకి రావటం పట్ల ప్రపంచవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని భౌతిక శాస్త్ర సీనియర్ అధ్యాపకులు డాక్టర్ సుంకర గోవర్ధనరావు పేర్కొన్నారు. సునీత విలియమ్స్ అంతరిక్షం నుంచి భూమికి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని బుర్రిపాలెం రోడ్డులోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో బుధవారం అభినందన సభను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరిక్ష రహస్యాలను ప్రపంచానికి తెలియజేయాలనే ఉద్దేశంతో తమ ప్రాణాలు లెక్కచేయకుండా వారు అక్కడికి వెళ్ళారని తెలిపారు. అంతరిక్షంలో ఎక్కువ సమయం ఉన్న తొలి మహిళగా, స్పెస్ వాక్ చేసిన తొలి మహిళగా రికార్డును సృష్టించారని చెప్పారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు బొల్లిముంత అమరేశ్వరరావు, ప్రిన్సిపల్ చింతల శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ బొల్లిముంత శివరామకృష్ణ, పలువురు అధ్యాపకులు ఉన్నారు.



మాట్లాడుతున్న అధ్యాపకులు గోవర్ధనరావు

మొక్కజొన్న పైరుకు చివరి నీటి తడులు పెట్టుకోవాలి

మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్

తెనాలి టౌన్: మొక్కజొన్న పైరుకు చివరి నీటి తడులు పెట్టుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని అంగలకుదురు,చావావారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ పాల్గొని రైతులకు వ్యవసాయ సంబంధమైన పలు విషయాలు సూచించారు.మొక్కజొన్న పైరు కండె దశలో ఉన్నందున ఈ నెలాఖరు లేదా ఏప్రిల్ మొదటి వారంలోకండె విరిచేందుకు పంట సిద్ధమవుతున్నట్లు తెలిపారు. రైతులు మొక్కజొన్న పైరుకు చివరి తడిగా నీటిని పెట్టుకోవాలని స్పష్టం చేశారు. మొక్కజొన్న అనంతరం పచ్చిరొట్ట పైరు వేయడంవల్ల భూసారం వృద్ధి చెందుతుందని తెలిపారు.కాంప్లెక్స్ ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గుతుందని అన్నారు. రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలని సూచించారు. అపరాల సాగుగా మినుము,పెసర పైరు వేసిన రైతులు పంటను ప్రభుత్వానికి అమ్మదలచినచో గ్రామంలోని రైతుసేవా కేంద్రాల్లో పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.వేసవిలో అపరాల సాగు చేసినచో భూసారం వృద్ధిచెందుతుందని వివరించారు.కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు సాయి దీపిక,పలువురు రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో ప్రేమ్‌సాగర్

డ్వాక్రా మహిళలకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ

తెనాలి టౌన్: డ్వాక్రా మహిళలు వృత్తి నైపుణ్యం పై అవగాహన పెంపొందించుకోవాలని సంగం జాగర్లమూడి గ్రామ సర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని సంగం జాగర్లమూడి గ్రామం ఎలిమెంటరీ పాఠశాలలో జెఎంజె మహిళా కళాశాల గృహ విజ్ఞానశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు వృత్తి నైపుణ్యంపై శిక్షణా తరగతులు నిర్వహించారు.ముఖ్యఅతిధిగా సర్పంచ్ జయనాగలక్ష్మి పాల్గొని శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. దుస్తులపై పెయింటింగ్,రంగుల వినియోగం, తయారీ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ జయనాగలక్ష్మి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు తెనాలి జెఎంజె మహిళా కళాశాల గృహ విజ్ఞానశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో టై అండ్ డై కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులు ఎంతో ఓర్పుతో మహిళలకు శిక్షణ ఇస్తున్నారని అభినందించారు.కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ జయనాగలక్ష్మి

పొగతో విద్యార్థుల వెతలు

రేపల్లె రూరల్: మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణ వాసులకు తిప్పలు తప్పటం లేదు. పట్టణంలోని మోంట్‌ఫోర్ట్ స్కూలు రోడ్డు సమీపంలో ఉన్న డంపింగ్ యార్డులోని చెత్తకు ఇటీవల మున్సిపల్ కార్మికులు నిప్పు అంటించారు. చెత్త రగులుకొని గత 15 రోజులుగా ఆ ప్రాంతంలో దట్టమైన పొగ రావటంతో పాటు వెదజల్లుతున్న దుర్గంధంతో స్థానికులు, ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత నాలుగు రోజుల నుంచి పగటి ఉష్ణోగ్రతలు అధికమవడంతో పాటు చెత్త నుంచి వస్తున్న పొగతో ఆ రహదారిపై వెళ్లే వారు ఊపిరి బిగపెట్టుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రస్తుతం మోంట్‌ఫోర్ట్ స్కూలులో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతుండటంతో రేపల్లె పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల నుంచి పరీక్షలు రాసేందుకు వస్తున్న విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పొగ కేవలం రోడ్డుపైనే కాకుండా పరీక్ష కేంద్రంలో సైతం కమ్మేస్తుండటంతో పరీక్షలు రాసే విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నట్లు ఇన్విజిలేటర్‌లు చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెత్తకు పెట్టిన మంటను అదుపుచేసి పొగ రాకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



డంపింగ్ యార్డు నుంచి వస్తున్న దట్టమైన పొగలో రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు, ప్రజలు

ఉచిత ధ్యాన యోగా కార్యక్రమం

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం సహజ యోగా ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. మాతాజీ నిర్మాలాదేవి మాట్లాడుతూ ఆత్మ సాక్షాత్కారం పొందడం అనేది చాలా సరళమైన సాధారణమైన ప్రక్రియ అని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా సహజ యోగా ధ్యాన సాధన ద్వారా ఆనందం పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ధ్యానం ఉచితంగా నేర్పబడనున్నట్లు చెప్పారు.

మాటల మాంత్రికుడు శ్రీరామకృష్ణ

- దర్శకత్వం నుంచి తెలుగు సినిమా స్టార్ రైటర్‌గా ప్రస్థానం
- తెనాలి నుంచి ఎదిగి చెన్నైలో స్థిరపడిన రైటర్
- మొత్తం 365 సినిమాలకు రచనా సహకారం
- రేపు స్వస్థలమైన తెనాలిలో ప్రథమ వర్ధంతి సందర్భంగా....



శ్రీరామకృష్ణ

తెనాలి: శ్రీరామకృష్ణ... తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తెనాలి వారసుడు. సహాయ దర్శకుడిగా కెరీర్‌ను ఆరంభించి దర్శకుడిగా ఎదిగి, రచయితగా కొనసాగిన మాటల మాంత్రికుడు. తెలుగు సినిమా హైదరాబాద్‌కు తరలివచ్చినా డబ్బింగ్ రచయితగా అవకాశాల వెల్లువతో చెన్నైలో స్థిరపడ్డారు. అయిదు దశాబ్దాల కెరీర్‌లో 360 పైగా సినిమాలకు సంభాషణలు సమకూర్చారు. శంకర్, మణిరత్నం వంటి ప్రసిద్ధ దర్శకుల సినిమాలకు తన డైలాగులతో సొగసులద్దిన లెజెండరీ రైటర్ శ్రీరామకృష్ణ. 74 ఏళ్ల వయసులో అనారోగ్యంతో గతేడాది చెన్నైలో కన్నుమూశారు. ఆయన తొలి వర్ధంతిని ఈనెల 21న స్వస్థలమైన తెనాలి చెంచుపేటలోని రావి టవర్స్‌లో నిర్వహించనున్నారు. శ్రీరామకృష్ణ పరిచయం. శ్రీరామకృష్ణ పూర్తిపేరు ముక్కామల రామకృష్ణ. అదే పేరుతో రెండు తెలుగు సినిమాలకు దర్శకత్వం వహించారు. జాతకం రీత్యా పేరుకు ముందు శ్రీ చేర్చుకుని శ్రీరామకృష్ణగా సినీ పరిశ్రమలో రైటర్‌గా స్థిరపడ్డారు. తల్లిదండ్రులు సీతారావమ్మ, పురుషోత్తం. వీరికి ఇద్దరు కుమార్తెలు. కుమారుడు. మిక్కిలినేని, రామకోటితో కలిసి పురుషోత్తం బుర్రకథలు చెప్పేవారట! కళాకారుడి కొడుకుగా శ్రీరామకృష్ణకు తొలి నుంచీ సినిమాల్లో నటించాలనే ఆసక్తి. తెనాలిలో పీయూసీ చదువుకు మధ్యలోనే దుమ్మా కొట్టాడు. చెన్నై రైలెక్కాడు. డిగ్రీ చదువుతూ సినిమా అవకాశాలకోసం ప్రయత్నించసాగాడు. ఆ క్రమంలో ప్రముఖ దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు దగ్గర సహాయ దర్శకుడిగా చేరారు. రెండు, మూడు సినిమాలు చేశాక ఆయన మరణించటంతో తమిళ దర్శకుడు దురై దగ్గర స్థానం లభించింది. 'వాడిగే వీడు', 'పసి' సినిమాలకు పనిచేశారు. 'చట్టానికి కళ్లు లేవు' సినిమాకు అసోసియేట్ దర్శకుడయ్యారు. శ్రీరామకృష్ణ ప్రతిభను గమనించిన దురై, 'సమాజంలో స్త్రీ' సినిమాకు దర్శకత్వం అవకాశం కల్పించారు. విజయశాంతి, రావుగోపాలరావు, సుమన్, భానుచందర్ నటించిన ఈ హీరోయిన్ ఓరియంటెడ్ సినిమా ప్రజాదరణ పొందింది. ఇదే సినిమాలో తమిళ నటుడు శరత్‌కుమార్‌కు అవకాశం ఇచ్చిన శ్రీరామకృష్ణ, ఆయనకు తానే స్వయంగా డబ్బింగ్ చెప్పారు. తర్వాత కళ్యాణ చక్రవర్తి హీరోగా 'బాలమురళి ఎంఏ సినిమాకు దర్శకత్వం వహించారు. ఇందులో కేవీ మహదేవన్, ఎస్పీ బాలు, పి.సుశీలతో కలిసి పనిచేశారు. నిర్మాతగా 'ధ్వని' అనే సినిమా తీశారు. ఈ తరుణంలోనే 'సాజన్' అనే హిందీ సినిమాకు మూలరచయిత కోరికపై తెలుగు సంభాషణలు రాయాల్సి వచ్చింది. ఆ డైలాగులు హిట్టవటంతో అవకాశాలు వరుసకట్టాయి. ఇక దర్శకత్వం జోలికి పోయేందుకు సమయం లేనట్టుగా తయారైంది. తమిళం, తెలుగు భాషల్లో మంచి పట్టు ఉండటంతో పాత్రల్లోని భావోద్వేగాలను దృష్టిలో వుంచుకుని అద్భుతంగా రాసేవారు. బొంబాయి, జీన్స్, ఒకే ఒక్కడు, అపరిచితుడు, జెంటిల్‌మెన్, చంద్రముఖి, భారతీయుడు, రోబో, రోబో 2.0, రావణ, రంగం, సెవెన్త్ సెన్స్, శివపురం, అరుణాచలం, వీఐపీ, కడలి, విక్రమసింహా, దొంగలకు దొంగ, మనోహరుడు, ఉత్తమ విలన్ వంటి సూపర్‌హిట్ సినిమాలకు రచనా సహకారం అందించారు. వీటిలోని డైలాగులు డబ్బింగ్ అనిపించవు. సహజంగా ఉండేలా రాశారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమాలు ముత్తు నుండి దర్బార్ వరకు డైలాగులను శ్రీరామకృష్ణ రాశారు. ప్రసిద్ధ దర్శకులు శంకర్, మణిరత్నం సినిమాల్లో 'మాటలు: శ్రీరామకృష్ణ' అనే ఉంటుంది. శ్రీరామకృష్ణ మాటలు రాశారంటే ఆ సినిమా హిట్టన్న భావన పరిశ్రమలో ఉండేది. మొత్తం 365 సినిమాలకు సంభాషణలు రాశారు. 'సఖి', సతీలీలావతి' సినిమాల్లో మాటలతోపాటు, పాటలూ రాశారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో అవకాశాలను తగ్గించుకున్నారు. రజనీకాంత్ 'దర్బార్' సినిమానే ఆయన చివరి సినిమా. 'సంతోషం' తొలి అవార్డును ఆయనే అందుకున్నారు. తెలుగు మూవీ డబ్బింగ్ ఆర్టిస్ట్స్ యూనియన్‌చే 'ఆరుద్ర లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు'తో సహా పలు అవార్డులను స్వీకరించారు. ఎంతగా ఎదిగినా ఒదిగా వుండటం ఆయన నైజం. ప్రచారానికి దూరంగా ఉండేవారు. విశ్రాంత జీవితం అనుభవిస్తూ 2024లో అనారోగ్యానికి గురయ్యారు. చెన్నైలోని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే ఏడాది ఏప్రిల్ ఒకటిన కన్నుమూశారు. ఆయన భార్య స్వాతి. భర్త మృతితో ఆమె స్వస్థలమైన తెనాలికి వచ్చేశారు.



దర్శకుడిగా విజయశాంతికి సూచనలు చేస్తూ...



ఎస్పీ బాలు, చిత్రలతో



మరో స్టార్ రైటర్ రాజశ్రీతో

వైద్యశాల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

భట్టిప్రోలు: గత ప్రభుత్వం వైద్యశాలల అభివృద్ధికి నాడు–నేడు విధానంలో నిధులు ఇవ్వడం జరిగిందని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి తెలిపారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీని మండల పరిషత్ అధ్యక్షురాలు, ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ కమిటీ చైర్మన్ లలితకుమారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వైద్యశాల రికార్డులు, గతంలో పని చేసిన పనుల వివరాలకు సంబంధించిన బిల్లులను పరిశీలించారు. రికార్డులు, బిల్లుల వివరాలను సక్రమంగా నిర్వహించాలని వైద్యశాల సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం కూడా వైద్యశాలల అభివృద్ధికి తగిన నిధులు ఇవ్వాలని ఆకాంక్షించారు. ఆ నిధులతో వైద్యశాల వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో నూతన నిర్మాణాలు చేపట్టడానికి ప్రతిపాదన సిద్ధం చేస్తామని అన్నారు. సిబ్బంది హాజరు, రాత్రి వేళల్లో అందుబాటు విషయంపై ఆరా తీశారు. ఆమె వెంట ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, వైద్యాధికారి ఎ.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ టి.ఉదయభాస్కరి, స్థానిక వైద్య సిబ్బంది ఉన్నారు.



వైద్యశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ లలిత కుమారి, జెడ్పీటీసీ, ఎంపీడీవో

రాయితీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్లపాలెం: బీసీ ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే రాయితీ రుణాలకు ఈ నెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయితీ రుణాలకు 21 నుంచి 60 ఏళ్ల లోపు పేదలు అర్హులని అన్నారు. దరఖాస్తుతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డుల జిరాక్స్‌లు జత పరచాలని చెప్పారు. చిన్న, మధ్య తరహా యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారందరూ వినియోగించుకోవాలని ఎంపీడీవో కోరారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్



తెనాలిరూరల్: పట్టణంలో పలు పదో తరగతి పరీక్ష కేంద్రాలను తహశీల్దార్ కె.వి. గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. పదో తరగతి పరీక్షలకు పట్టణంలో 11, రూరల్ ప్రాంతంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం హైస్కూల్, కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల, డి ఇందిర మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఆయా పాఠశాలలకు కేటాయించిన పరీక్ష సిబ్బంది ద్వారా ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో పూర్తిస్థాయిలో మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబి, పలువురు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.